# జీవిత పోరాటం ....

రచన :
శ్రీమతి పతానేని శ్రీశైల భ్రమరాంబ.

ఆకాశం తొలకరి మబ్బులతో, ప్రకృతి మసకమసక చీకటులతో నిండిపోయింది. మృగశిర కార్తి తొలకరి చినుకులు జిలుకు రాళ్ళల్లాగ సస్యశ్యామల మయ్యే పంటకు భాగ్య విధాతలం మేమే అన్నంత ధీమాగా క్షణక్షణానికో చినుకులు రాలుతోంది. పైకి అగుపడే సముద్రంలా వీధులు ఎంతో ప్రశాంతంగా వున్నాయి. కాని సముద్ర గర్భమందున్న ఎన్నో వేల భయంకర జీవరాసుల ప్రళయ వికటాట్టహాసాలు, అది సహించలేని అమాయిక మూగజీవుల ఆర్తనాదాల ఘోష ఎంత ఆకళింపుగా వుంటుందో ఎవరికి తెలుసు? ఆ సముద్రపు లోతుల్లో అట్టడుగుల వుండేదికూడా తెల్సుకొంటోంది మంజుల.

బీచ్ కి రంగురంగుల బట్టలతో రంగేళీల్లా షికార్లు కొడ్తూన్న స్నేహితుల జంటలు, భార్యాభర్తలు, బాదరబందీలేని వృద్ధులు, అయోమయంగా అల్లరిచేస్తూన్న బాలబాలికలు అందరూ సముద్రపు ఒడ్డున పచార్లు చేస్తున్నారు. చిత్రమైన ముఖకళవళికలతో పరీక్షిస్తూ తనలో తను నవ్వుకొంటూ, ఏదో తెలీని అనుభూతికి వెనుక అనిర్వచనీయమైన ఆవేదనకు గురిఔతోంది మంజుల... సముద్రం వైపుకి చూస్తూంటే మంజులకి అర్థంకాని ఆవేదన... దానికి తోడు వేడినిట్టూర్పులు ఆమె గతంలోకి ఒక్కసారి తొంగిచూచుకొంది. భవిష్యత్ ఊహించుకోలేని అగాధం! వర్తమానంలో సాధించుకోలేని అసమర్థత!! గతం త్రవ్వితే బ్రతుకుమీద రోత!!! తన జీవితమంతా ధారపోసినా తనకి సానుభూతిలేదు. ఒకప్పుడు తను ఆదర్శజీవిగా బ్రతకాలన్న ఆశలన్నీ నిరాశలే! బ్రతకడం చేతకానితను; జీవితపు ఒడిదుడుకులకు తట్టుకోలేని తను; ఎందుకోసం జీవించాలి? తనని చూచి ఎవరు సంతోషించాలి? మంజుల బుర్ర గిర్రున తిరిగిపోతోంది. తన జీవితపోరాటంలో అనుదినం ఎదుర్కొంటున్న సంఘటనలు గుర్తొస్తున్నాయి మంజులకి.

'అయిదువేల రూపాయలతో అఖండ వైభవంగా పెళ్ళిచేస్తే; నీ మొహాన్న సుఖపడే గీటులేక ఆ మొగుడు కాస్తా గుటుక్కుమన్నాడు. ముండా మోపానని మూలపడుండక ఎందుకే నేనమ్మా తగుదునని వీధులంట తిరగడం? నిన్ను కన్నానేకాని నీ తలవ్రాతను కనలేదు నేను. వీధులో సంపాదనా లేదు; యింట్లో తల్లికి సాయంలేదు; రెంటికీ చెడిన బ్రతుకు నీది. తనదీ ఓ బ్రతుకేనా? తవుడూ ఓ రొట్టేనా? అని చచ్చినట్లు నోరెత్తక పడుండు. ఓ పూట వంటయినా సాయంచెయ్యకపోతే నువ్వు బ్రతికున్నందుకు మాకేం లాభం?' అంటుంది మనస్సు విరిగిన మాతృమూర్తి.

'వెధవముండవుకదా అని జాలిపడి వేలకివేలు పోసి చదువు చెప్పిస్తే... యఫ్. ఎ. లో ఫస్టుక్లాసు తెచ్చుకొని ఆనర్సులో సున్నాచుట్టి వస్తావనుకోలేదు. ఊళ్లంట తిరిగి చదువుకొనేవరకూ వేధించడమేకాని ఉద్యోగంమాత్రం శూన్యం. మొగుడు చచ్చినా; పరీక్ష పోయినా; వేషభాషలుమాత్రం పోలేదు. నువ్విల్లా వుంటే మిగతా ఆడపిల్లలకి పెళ్ళిళ్లు ఎల్లా అవుతాయి? కొడుకులకైనా మిగల్చకుండా నా ధనమంతా నీకోసం తగలబెట్టాను. విధవ కూతుర్ని వెధవలా పడుండనివ్వక పైకి తేవాలనుకోవడం నాదే బుద్ధితక్కువ—' అన్నాడు హృదయంలేని కన్నతండ్రి.

'మూడేళ్లూ బి. ఎ. ఆనర్సు చదివి, పరీక్ష తగలేసి యింటికి వచ్చిన దొరసానికి; యింట్లో పన్లు చెయ్యమంటే కోపం! అంత పౌరుషమైనదానివైతే త్వరగా ఉద్యోగం చేసి ధనం గడించరాదూ?' అభిమానంలేని అక్కా, చెల్లీకూడా అంటున్నారు.

'కుటుంబ గౌరవాన్ని నిలబెట్టి నీతిగా బ్రతకాలంటే మా యింటికేవచ్చి పడుండమనండి. మాతోబాటు యింత చాకిరీచేస్తూ కలో, గంజో త్రాగి పడుండమనండి' అని అత్తవారు వర్తమానాలు పంపించారు.

'చదువుకి తగలేసిన డబ్బు చాలక యింకా ఈ ఉద్యోగపు ధరఖాస్తులకికూడా ఎందుకు వడ్డీ డబ్బు పాడుచేస్తావ్? నీచేత్తో పంపించిన దరఖాస్తులన్నీ బుట్టదాఖలాయేనని యిప్పటికైనా తెలియడంలేదా? యికనైనా నోరుమూసుకు యింట్లో పడుండు_' అన్నగారు ఖుస్సుమన్నాడు.

'మనింట్లోనుంచి ఈ శనిఘటం ఛస్తేకాని మిగతావాళ్ళు వృద్ధిలోకి రారు.' దయలేని తమ్ముడు అన్నాడు.

'ఎక్కడపడితే అక్కడికి చెత్తకుక్కల్లా వెళ్ళినంత మాత్రాన్న ఉద్యోగం యిచ్చేస్తారా? పట్నంలోవుండి బుద్ధిగా చదువుకొంటే ఫష్టుక్లాస్ తెచ్చుకొందువు; అచ్చోసిన ఆంబోతులా తిరిగి, చదువు సంధ్యలు మానేసి, డబ్బు తగలేసి మొద్దుమొహంతో కొంపకు చేరింది చాలక యింకా ఆఫీసులన్నీ ఎక్కి దిగడ మెందుకో? మాకు అప్రతిష్ట తేకుండా యిప్పటికైనా ఆ అత్తారింటికి పోకూడదూ? పిల్లలతో సంసారం గడవక కటకట్లాడుతూంటే మా నెత్తినెందుకూ?' వదిన గారు కఠోరంగా అంది.

'పాతికేళ్ళ పడుచుది; ఎక్కడా తను విధవనన్నా కించలేకుండా ఆ కట్టూ, బట్టా, ఆ వేషం చూస్తేనే మనిషిగుణం తెలుస్తోంది. పనీ పాటూ లేకుండా బరి తెగించినట్లుగా వుద్యోగం కోసమంటూ వంకమీద తిరుగుతోంది. అసలు ఆ మంజులకి ఈ జన్మలో ఉద్యోగ మంటూ వస్తుందా?' యిరుగూ పొరుగూ విమర్శించారు.

'మింగ మెతుకూ లేదు; చదువూ సున్నా చుట్టింది.. రోజూ ఈ యిస్త్రీ బట్టలూ, వేషం ఎందుకో?' ఈర్ష్యగా అన్నారు బంధువులు-

'చాల్లే నీ వెధవ పెద్దరికం! నీ పోలిక ఈ యింట్లో ఎవ్వరికీ రానక్కర్లేదు - నోరు మూసుకొని ఓచోట పరుండక అన్నింటిల్లోనూ నేనమ్మా అంటూ ఎందుకు జొరబడతావ్?' అది యింట్లో అన్నగారి పిల్లలూ, అక్కగారి పిల్లలూ కలిసి ఈసడించారు.

'ఇక్కడ నీకోసం ఉద్యోగం సిద్ధంగా లేదు - గెట వుట్.' ఆఫీసుల్లో మేనేజర్లు గాండ్రించారు.

'బి. ఎ. ఆనర్సు పోగొట్టుకొని, ఏడాదినుంచి అడ్డమైన ఊళ్ళూ తిరిగితిరిగి నిరుద్యోగిగా కొంపకుచేరిన నీ చేత ప్రయివేటు చెప్పిస్తే మా పిల్లలుకూడా చెడిపోతారు...' విద్యార్థుల తల్లులుకూడా నిరశించారు.

'నువ్వు ఆస్తమానూ వచ్చి కూర్చుంటే మాకు టైమ్ దండగఅవుతోంది. నీ సోది వినడానికి మాకు తీరిక లేదు బంక జలగలా పట్టుకొని వదలవేమిటి? త్వరగా యిక్కడ నుంచి వెళ్ళిపో! నీకు ఉద్యోగం కోసం మేము సిఫారుసులు చెయ్యలేం'' అన్నారు స్నేహితులు.

'మీ కింక ఉద్యోగం రాదు. రెక్కల్లో సత్తువవుంది కాబట్టి ఏ కాఫీ హోటల్లో నైనా పిండిరుబ్బితే నెలకో యాభై రూపాయలైనా వస్తాయి. అల్లా చెయ్యండి అమ్మాయిగారూ!' దాసీమనిషి సలహా యిచ్చింది.

ఇవన్నీ తోరణంలా ఒక్కొక్కటే గుర్తొస్తొంటే సముద్రపు ఒడ్డున కూర్చున్న మంజులకి కళ్ళంట సంతత ధారగా కన్నీరు కారుతోంది. సముద్రపు కెరటాల్లా దుఃఖం పొంగుకొస్తోంది? యింక తన గతేమిటి?

'మంజులా! అదృష్టం లేక గట్టున పడ్డ చేప పిల్లలా గిలగిల్లాడుతువున్నా... విధాత నీకు జీవితంలో సుఖం, శాంతి అనేవి లోటుచేసాడు. నువ్వూ అందరిలానే పుట్టావు. కానీ నీ జీవితం కటికిచీకటి. గాఢాంధకారం. వెలుగుకిరణాల ప్రకాశం నీకింక లేదు - రాదు!

నీ జీవితంలో పోరాడి ప్రేమించిన భర్తను పెళ్ళి చేసుకున్నావు. కాని విధి ఎదురుదెబ్బ తీసి కలరా వ్యాధితో నీ భర్తను యమునియింటికి ఈడ్చుకుపోయింది. యింట్లో అందరినీ ధిక్కరించి, సత్యాగ్రహం చేసి సాధించి చదువు సాగించావు - కాని దురదృష్ట దేవత వ్యాధి రూపంలో నీలో ప్రవేశించి, పరీక్ష పేపర్లు పూర్తయ్యేవరకూ గుండెల్లో పోట్లు తగ్గకుండా చేసింది. ఎల్లాగైనా ఉద్యోగం సంపాదించాలని నిద్రాహారాలు విసర్జించి దీక్షతో తిరిగావ్. కాని నీకంటే ముందే విధి దేవత వికటాట్టహాసం చేస్తూ బయల్దేరుతోంది. యింక నువ్వు జీవితంలో గెలుపు పొందలేవు. సంఘంలో, యింట్లో, ఎక్కడా నీకు గౌరవం, సానుభూతి అనేవి లభించవు, నువ్వు నీతి, నిజాయితీతో ఎంత ఓర్పుగా నడుచుకొన్నా, నీమీద జాలి, ప్రేమ అనేవి ఈ లోకానికి లేవు. అన్నివిధాలా ఓడిపోయిన నువ్వు నీ జీవితమే అంతం చేసుకో. యింక జీవితంతో పోరాడలేవు.' ప్రకృతి జాలిగా ఘోషించింది. ఎగిరిపడే సముద్ర కెరటాలు చేతులుచాపి మంజులని ఆహ్వానించి తీసుకు వెళ్ళాయి.